ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 20 మార్చి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:22 (బుధ)
సహరి : 4:45 (గురు)



వదల బొమ్మాళీ !

ఇంకా తొలగని బొమ్మలు..రంగులు

బహిరంగ ప్రదేశాల్లో కనిపిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు, కోడ్ అమలులో నిర్లక్ష్యంపై విమర్శలు

గోపవరంలో వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం, చిన్నంపేటలో ఓ భవనంపై ఉన్న జగన్ హోర్డింగ్

7



ఏలూరు జడ్పీ కార్యాలయ ఆవరణలో ముసుగువేయని ఇందిరమ్మ విగ్రహం, పత్తేబాదలో వైసీపీ జెండా మాదిరిగా విద్యుత్‌లైట్లు

గ్యాస్ సిలిండర్లపై అదనంగా వసూలు చేయొద్దు : జేసీ



ఏలూరు, కలెక్టరేట్, మార్చి 19: వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అదనంగా నగదు వసూలు చేసే గ్యాస్ కంపెనీ డీలర్లపై చర్యలు తీసుకుంటా మని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో మంగళవారం వంటగ్యాస్ పంపిణీపై జిల్లాలోని గ్యాస్ కంపెనీ ఏజెంట్లతో జిల్లా పౌర సరఫరాలశాఖాధికారి ఆర్.సత్యనారాయణరాజుతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్లు సక్రమంగా పంపిణీ చేయాలని, 15 కిలోమీటర్ల లోపు వరకు ఎటువంటి చార్జీలు వసూలు చేయరాద న్నారు. కొంతమంది గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ గ్యాస్ సిలిండర్ పంపిణీకి అదనంగా వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనధికారికంగా వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సిలిండర్ బరువులో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని, గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించా లన్నారు. సహాయ పౌర సరఫరాల అధికారులు, పలు గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, డీలర్లు పాల్గొన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు 1,676మంది గైర్హాజరు

- ఏప్రిల్ ఒకటి నుంచి జవాబు పత్రాల మూల్యాంకన

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 19 :పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండో రోజు మంగళవారం జరిగిన హిం దీ పరీక్షకు జిల్లాలో 24,209 మంది విద్యార్థులకు 23,452 మంది హాజర య్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరితోపాటు మరో 1,342మంది వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులకు (ప్రైవేటు/కంపార్ట్‌మెంటల్) 423 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాం తంగా ముగిసిందన్నారు. ఈ పరీక్షలు ఈనెల 30వ తేదీతో ముగుస్తుండగా ఏప్రిల్ ఒక టో తేదీ నుంచి 8వ తేదీ వరకు జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను కొత్త జిల్లాల కేంద్రాల్లో చేపట్టేలా ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. స్పాట్ ప్రక్రియకు నియమితులైన ఏఈలు, సీఈలు, స్పెషల్ అసిస్టెంట్లకు బార్‌కోడింగ్ విధానంపై ఏప్రిల్ ఒకటిన పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

లింగనిర్ధారణ శిక్షార్హం

- డీఎంహెచ్‌వో శర్మిష్ట

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 19 : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, చట్టానికి వ్యతిరేకంగా ఏ ఆస్ప త్రి/ డయాగ్న స్టిక్ సెంటర్‌లోనైనా లింగ నిర్ధారణ చేస్తే శిక్షార్హులవుతారని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ప్రభుత్వా సుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్జీవోలు, అడ్వకేట్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.



తేల్చాల్సింది కమలమే !

ఏలూరు - నరసాపురం ఎంపీ స్థానాలు ఏ పార్టీకి

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల నుంచి ఎవరెవరు పోటీ చేయబోతున్నారు ? ఏ స్థానాన్ని ఏ పార్టీ ఎంచుకున్నాయి ? ఎన్నికల కురుక్షేత్రంలో ఎత్తులు, పైఎత్తులు ఎలా సాగుతున్నాయి ? ఉమ్మడిగా జతకట్టి 'త్రిశూలం' వైసీపీపై ఎలా దూసుకుపోతోంది ? ఇలా ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే కమలంలో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన వీడాలి. ఆ పార్టీ ఇచ్చే ముక్తాయింపును బట్టే అభ్యర్థుల ఎంపిక జరగబోతోంది.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

పొత్తుల్లో భాగంగా ఏలూరు లోక్‌సభ స్థానం తెలుగుదేశానికి, నరసాపురం బీజేపీకి వెళ్లింది. ముందుగా బీజేపీ, ఏలూరు లేదా నరసాపురం లోక్‌సభ స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటిస్తే తదనుగుణంగానే టీడీపీ తదుపరి నిర్ణయం తీసుకుంటుందంటూ విశ్లేషణ ఆరంభమైంది. ఏలూరు స్థానాన్ని బీజేపీకి కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి చొచ్చుకువచ్చారు. తదనుగుణంగానే ఆత్మీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్ఎస్ వర్గాలు తనకు చేదోడువాదోడుగా ఉన్నాయంటూ ఎప్పుడు జాబితా వెలువడినా ఆ జాబితాలో తన పేరు తప్పనిసరిగా ఉంటుందంటూ ఇప్పటి వరకు ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి పొత్తులో ఉన్న పార్టీల్లో ఒకింత గందరగోళం ఏర్పడింది. తొలుత ఏలూరులో పోటీకి గోరుముచ్చు గోపాల్‌యాదవ్ టీడీపీ నుంచి ముందుకు వచ్చారు. మూడు రోజులుగా ఈ స్థానం నుంచి తన పోటీ ఖాయమైందని యనమల రామకృష్ణుడి అల్లుడు పుట్టా మహేష్‌యాదవ్ పేరిట ప్రచారం సాగింది. వీరిద్దరూ కాకుండా పోలీస్ అధికారి సత్యనారాయణ పేరు పరిశీలనకు వచ్చినట్టు ఆయనవైపే అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు మరో ప్రచారం మంగళవారం వరకు వ్యాపించింది. సత్యనారాయణది కైకలూరు నియోజకవర్గం పరిధిలోని మండవల్లి స్వగ్రామం. జంట నగరాల్లో ఐజీ స్థాయి హోదాలో ఆయన ఉన్నారు. టీడీపీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి ప్రదర్శించడం దీనికి అనువుగానే కొందరు నేతలు ఆయనను టీడీపీకి ముఖ్య నేతల ముందుకు తీసుకువెళ్ళగలిగారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన ఆయన బీసీ ఓటర్లతోపాటు మిగతా వారిని ఆకట్టుకుంటారని ఆయన అనుకూలురు ప్రచారానికి దిగారు.

రఘురామ ఏ పార్టీ నుంచి ?

మరోవైపు నరసాపురంలో ఇంకో సీన్ నడుస్తోంది. ఈ లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు పోటీ చేయడం ఖాయమనే ధీమాతోనే ఆయన ముఖ్య అనుచరగణమంతా ఉంది. నరసాపురం లోక్‌సభ స్థానాన్ని పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. తాజా పరిణామాల క్రమంలో రఘురామ ఏ పార్టీ నుంచి పోటీ చేయబోతున్నాడంటూ ఓటర్లను ఒకింత ఆసక్తి నెలకొంది. ఆయన పోటీ చేయడం ఖాయమైనా అది ఏ పార్టీ నుంచి అనేది తేలకపోవడంతో జనసేన, టీడీపీ, బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరోవైపు నరసాపురం ఎంపీ స్థానానికి శ్రీనివాసవర్మ దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ పొత్తులో తనకు కేటాయించిన ఆరు లోక్‌సభ స్థానాలు అభ్యర్థుల ఎంపికపై తాజాగా కసరత్తుకు దిగింది. బీజేపీ కోర్ కమిటీ ఒకమారు సమావేశమై మంగళవారం రాత్రి ఢిల్లీలోని ముఖ్య నేతలతో సంప్రదింపులు చేస్తోంది. ఏ పరిస్థితుల్లోనూ బీజేపీ తనకు కేటాయించిన ఆరు స్థానాల్లో ఎంపీ అభ్యర్థులను నిర్ధారించిన తరువాతే జాబితా విడుదలకు తెలుగుదేశం, జనసేన సిద్ధం అవుతున్నాయి. ఎందుకంటే ప్రత్యేకించి నరసాపురం స్థానం ఒకవైపు కీలకం కావడం, రెండోది ఏలూరు లోక్‌సభ స్థానం కూడా బీజేపీ ముఖ్యనేతలు ఆశించటం తాజా రాజకీయ పరిణామం. ఈ రెండింటిలో చివరికి ఏ స్థానాన్ని బీజేపీ మిగుల్చుకుంటుంది, లేదా తమకు పొత్తులో భాగంగా ముందస్తుగా కేటాయించిన నరసాపురంనే ఎంపిక చేసుకొని అక్కడే అభ్యర్థిని నిర్ధారించి ప్రకటించబోతుందా? అనేది ఇప్పుడు అందరి ముందు ఉన్న ఏకైక ప్రశ్న.

బీజేపీ తేలిస్తేనే..

ఎంపీ స్థానంలో ఎవరెవరు పోటీ చేయబోతున్నారనే జాబితాను ప్రకటించటానికి బీజేపీ చేసిన జాప్యమే కారణంగా భావిస్తున్నారు. ఎంపీ అభ్యర్థుల జాబితాను మంగళ, బుధవారాల్లోనే తేల్చాల్సి ఉంది. ఈ దిశగానే తెలుగుదేశం ఇప్పటికే 17 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తి చేసిందని, ఆరు స్థానాల్లో బీజేపీ, రెండుస్థానాల్లో జనసేన అభ్యర్థులు ఇద్దర్ని ఖరారు చేసి ఉమ్మడిగా ఎంపీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అందరూ భావించారు. అయితే కమలనాథులు మాత్రం ఎంపీ స్థానాల అభ్యర్థుల విషయంలో సుదీర్ఘకసరత్తు కొనసాగిస్తున్నారు. ప్రత్యేకించి రఘురామకృష్ణంరాజు పోటీ ఒక మేజర్ సబ్జెక్టుగా మారింది. వీలైతే బుధవారం నాటికి జాబితా బహిర్గతం చేయాలనే దిశగా మంగళవారం అంతా బీజేపీ అభ్యర్థులపై తుదిచర్చలో నిర్ధారణకు రావచ్చని ఇంకొందరి భావన. ఇదంతా సాఫీగా సాగితే జాబితా రెడీ అయ్యి ప్రకటన వెలువడుతుంది.

కేటాయింపుపై రోజంతా కమలనాథుల సుదీర్ఘ కసరత్తు

- అది తేల్చిన తర్వాతే ఉమ్మడి జాబితా విడుదల
- నేడో, రేపో ప్రకటనపై ఆశలు

• ఎవరు.. ఏ పార్టీ నుంచి



తపన చౌదరి, రఘురామకృష్ణంరాజు



గోపాల్ యాదవ్, పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్



సత్యనారాయణ - శ్రీనివాసవర్మ



సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- అపరిచిత వ్యక్తుల ప్రవేశంపై సమాచారమివ్వాలి : డీఎస్పీ



పోలవరం, మార్చి 19 :జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తుల ప్రవేశం, సంచారం పట్ల సమాచారమిచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర సరిహద్దు అడవుల్లో మంగళవారం ఉదయం పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టు నేతలు హతమైన నేపథ్యంలో మిగతా మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించే అవకాశాలున్నాయన్నారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, టి.నరసాపురం, పాపికొండల అభయారణ్యం ప్రాంతాల ద్వారా జిల్లాలోకి వచ్చే అవకాశాలున్నాయని, గతంలో పాపికొండల అభయారణ్యం మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు గోదావరి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి అపరిచిత వ్యక్తుల కదలికలు, ప్రవేశంపట్ల స్థానిక పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు. చెక్‌పోస్టుల్లో అనుమానిత వ్యక్తులను పోలీసులు తనిఖీలు నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు.

ఎస్ఐ కేశవరావుకు ఉగాది ఉత్తమ సేవా పురస్కారం



ఏలూరు క్రైం, మార్చి 19 : ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాలను పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారికి ప్రకటించింది. జిల్లాలో ఇటీవల బదిలీ అయిన ఎస్ఐ గొరిపర్తి కేశవరావు (ఎస్ఐ 1008)కు ఉత్తమ సేవా పతకం ప్రభుత్వం ప్రకటించింది. 1987లో కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో చేరిన కేశవరావు 2010లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది. తరువాత 2013లో ఏఎస్ఐగా, 2021లో ఎస్ఐగా పదోన్నతి పొందారు.ఇటీవల ఎన్నికల నియమావళిని పురస్కరించుకుని కృష్ణా జిల్లా గన్నవరం ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ అయ్యారు.



రహదారిపై చెల్లా చెదురుగా పడిన తాటిదుంగలు

రహదారిపై గొయ్యి.. ట్రాక్టర్ బోల్తా

- పెదవేగి రహదారిలో రాకపోకలకు అంతరాయం

పెదవేగి, మార్చి 19: తాటి దుంగల లోడుతో పెదవేగి వెళుతున్న ట్రాక్టర్ రహదారిపై గోతిలో పడి తిరగబడింది. రహదారికి అడ్డంగా ట్రాక్టర్ పడడంతో తాటి దుంగలు రోడ్డుపై పడ్డాయి. దీనితో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఈ సంఘటన జరగడంతో ఉద్యోగులు కార్యాల యాలకు వెళ్లే సమయం కావడంతో ఇబ్బందులు పడ్డారు. ట్రాక్టర్ రహదారిపై గోతిలో పడడంతో ట్రాక్టర్, ట్రక్కును కలిపి ఉంచే లివర్ మధ్య ఉన్న లింకు (చింతకాయ) విరిగి, ట్రాక్టర్ రోడ్డుపై తిరగబడింది. దీంతో ట్రక్కులో ఉన్న తాటి దుంగలు రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి. అదృష్టవశాత్తు ట్రక్కు మాత్రమే తిరగబడడంతో ట్రాక్టర్ ఇంజన్‌పై ఉన్న వ్యక్తులు ప్రమాదంనుంచి బయటపడ్డారు. కాగా కొంతమంది వాహన చోదకులుకూడా వారికి సాయం చేయడంతో ట్రాక్టర్‌ను పైకి లేపి, దుంగలను తిరిగి ట్రాక్టర్‌లోకి చేర్చారు.

భర్తపై కేసు నమోదు చేయండి

- కలెక్టరేట్ వద్ద బాధిత మహిళ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళ

ఏలూరు కలెక్టరేట్, మార్చి 19: నడిరోడ్డుపై భర్త తీవ్రంగా గాయపరిచి దుర్భాషలాడాడని, అతడి పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసునమోదు చేయడం లేదని, కేసు నమోదు చేయాలంటూ బాధిత మహిళ మంగళవారం కలెక్టరే ట్ వద్ద ఆందోళన నిర్వహించింది. బుట్టాయిగూడెం మండలం జయనవారిగూడెంకు చెందిన ఊడా నాగమణి భర్త నాగరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు అదే గ్రామంలో మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈనెల 10న భర్త వివాహేతర సంబంధంపై నిలదీయ డంతో కోపోద్రిక్తుడై భార్యను నడిరోడ్డుపై జుట్టుపట్టుకుని ఈడ్చు కుంటూ చితకబాదాడు. అదే సమయంలో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళ బంధువులు సైతం ఆమెను దుర్భాషలాడుతూ గాయపరిచారు. తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించడంతో స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా బుట్టాయగూడెం పోలీసులు పట్టించుకోవడం లేదని న్యాయం చేయా లంటూ డిమాండ్ చేసింది. పోలీసులు నాగరాజుకు వంతపాడుతున్నారని, కేసు నమోదు చేయమంటున్నారని కన్నీటి పర్యంతమైంది. భర్తపై తక్షణం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లోనూ, ఎస్పీ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో టి.భానుదేవి, తామా రాధా, టి.వెంకటలక్ష్మి, ఎస్.నాగదుర్గ, పి.గంగాజలం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తగ్గని పెట్రోపన్ను



- కేంద్రం ధరలు తగ్గించినా ప్రభుత్వం ససేమిరా
- ఐదేళ్లలో ఒక్కసారి కూడా స్పందించని వైసీపీ



ఏలూరులో పెట్రోలు బంకు వద్ద వాహనదారులు

ఏలూరు రూరల్, మార్చి 19:పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తూ ఇటీవల కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడానికి ముందు ఈ ప్రకటన వెలువడడంతో వాహనదారులకు ఉపశమ నం లభించింది. రాష్ట్రప్రభుత్వం మాత్రం వాటిపై పన్నులు తగ్గించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోధరల అదుపునకు ఏపీ, తెలంగాణ, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు పన్నులు తగ్గించుకోవాలని 2022లో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 22 నెలల వ్యవధిలో కేంద్రం మూడుసార్లు పెట్రో ధరలు తగ్గించింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా పెట్రోల్, డీజిల్ పన్నులను తగ్గించకపోవడంపై వాహనదారులు, ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా 2021 నవంబరు 4న కేంద్రం లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.10 ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది. 2022లో పెట్రోల్ లీటరు 9.52, డీజిల్‌కు రూ.7.38 తగ్గించింది. తాజాగా కేంద్రం నిర్ణయంతో పన్నులతో కలిపి ప్రస్తుతం లీటరు పెట్రోల్‌కు రూ.2.19, డీజిల్‌కు రూ.2.10 మేర తగ్గిం చింది. జిల్లాలో లీటరు పెట్రోల్ ధర రూ.111.78 నుంచి రూ.109.57కు, డీజిల్ లీటరు రూ.99.46 నుంచి రూ.97.36కు దిగివచ్చింది. రాష్ట్రప్రభుత్వం కూడా పెట్రోపన్ను తగ్గిస్తే వాటి ధరలు మరింత తగ్గేవి. అంతేకాకుండా రవాణాఛార్జీలు, నిత్యావసర ధరలు కూడా తగ్గేవి. అవేమి వైసీపీ ప్రభుత్వం చేయకపోవడంతో వాహనదారులు మండిపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్, లీటరుకు రూ.4 అదనపు వ్యాట్, ఒక రూపాయి రోడ్డు అభివృద్ధి సెస్ ఉంది. డీజిల్‌పై రూ.22.25శాతం వ్యాట్, లీటరు అదనపు వ్యాట్ రూ.4, ఒక రూపాయి రోడ్డు అభివృద్ధి సెస్ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ మాత్రం పన్నులు తగ్గించినా ఈ ధరలు మరింత కిందకు దిగివచ్చేవని, నిత్యావసర ధరలు కూడా తగ్గేవని ప్రజలు అంటున్నారు.

సమైక్య పోరాటాలతోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 19 : ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లాశాఖ కార్య వర్గ సమావేశం మంగళవారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని డాక్టర్స్ భవనంలో జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కారరావు మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమైక్యంగా పోరాడినపుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలను గ్రేడ్-2కి ఉద్యోగోన్నతి చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారం తగ్గించాలని, అర్హతలుండి రెగ్యులరైజేషన్ ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. జిల్లా సంఘానికి త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అప్పారావు, రామకృష్ణ, గోవిందరావు, రాష్ట్ర కార్యదర్శి రమేష్, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

పది పరీక్షకు వెళుతుండగా ప్రమాదం

విద్యార్థి తలకు గాయం..చికిత్స తీసుకుని హాజరు


గాయమైన విద్యార్థి యువరాజు

వీరవాసరం, జనవరి 19: వీరవాసరంలోని పదో తరగతి పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థి ప్రమాదానికి గురై గాయాల పాలయ్యాడు. ప్రథమ చికిత్స అనంతరం తిరిగి వచ్చి పరీక్ష రాశాడు. వీరవాసరం ఎంఆర్‌కె జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న అడిదల యువరాజును డివైన్‌మెర్సీ స్కూల్‌లో పరీక్ష రాసేందుకు మంగళవారం బాలేపల్లి నుంచి గుడాల రవి అనే వ్యక్తి మోటారుబైక్‌పై తీసుకు వస్తున్నాడు.వీరవాసరం-పాలకొల్లు రహదారి పక్కన ఉన్న పరీక్ష కేంద్రంలోకి వెడుతుండగా పాలకొల్లు నుంచి వస్తున్న మోటార్‌బైక్ ఢీకొట్టింది. రెండు బైక్‌లపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని భీమవరం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యువరాజు పదో తరగతి పరీక్ష రాయాల్సి ఉండడంతో జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం అందించారు. తలకు గాయమైనప్పటికీ యువరాజు హిందీ పరీక్ష రాసేందుకు సముఖత వ్యక్తం చేయడంతో ప్రాథమిక చికిత్స అనంతరం అరగంట లేటయినా పరీక్షా కేంద్రానికి అనుమతి ఇచ్చారు.

పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్లు స్వాధీనం

ఆకివీడు, మార్చి 19: పదో తరగతి హిందీ పరీక్ష జరుగుతున్న ఆకివీడులోని ఒక ప్రైవేటు స్కూల్‌లో బీరువాలో ఫోన్‌లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. పరీక్షల సందర్భంగా నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించడంతో స్కూళ్లకు ఫోన్‌లను అనుమతించడం లేదు. మంగళవారం అబ్జర్వర్ ఆర్.నరశింహారావు పరీక్ష కేంద్రం తనిఖీకి వచ్చిన సమయంలో సీఎస్, డీవోలతో పాటు ఇన్విజిలేటర్ల ఫోన్లు బీరువాలో ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకొని భీమవరం డీఈవో కార్యాలయంలో అప్పగించారు. పరీక్ష సమయంలో సెక్యూరిటీ దగ్గర ఉంచాలని నిబంధనలు ఉన్నాయని నిబంధనలకు విరుద్ధంగా ఫోన్లు తీసుకురావడంపై విచారణ నిర్వహించి అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.



బూన్‌కి జాతీయ పురస్కారం అందజేస్తున్న ఎన్‌సీఆర్‌సీ చైర్మన్ నాగేశ్వరరావు

జేమ్స్ బూన్‌కి మానవ హక్కుల సేవా పురస్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 19 : వైద్య, ఆరోగ్యరంగాల్లో మానవ హక్కులపై వివిధ కార్యక్రమాలు చేపట్టినందుకు జిల్లాకు చెందిన జాతీయ వినియోగదారుల హక్కుల సమాఖ్య (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ వి.జేమ్స్ బూన్‌కు ఎన్‌సీఆర్‌సీ జాతీయ పురస్కారం లభించింది. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ (ఐఐసీ)లో నిర్వహించిన సదస్సులో ఈ అవార్డుని జేమ్స్ బూన్‌కు నేషనల్ కన్స్యూమర్స్ రైట్స్ కమిషన్ చైర్మన్ నాగేశ్వరరావు అందజేశారు. ఐదేళ్ళుగా వైద్య ఆరోగ్య రంగంలో వినియోగదారుల హక్కులకోసం ఆయనచేస్తున్న కృషిని అభినందించారు. ఈయనతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన 30 మందికి పురస్కారాలను బహూకరించారు.

ప్రజలకు అసౌకర్యం లేకుండా వైద్యం అందించాలి


శృంగవృక్షంలో మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

పాలకోడేరు, మార్చి 19 : వేసవిలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పిస్తూ ప్రతీ ఒక్కరికి ఆరోగ్య సేవలు సకాలంలో అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. శృంగవృక్షంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. క్యాంప్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరిని పరిశీలించి వారికి మందులు అందించాలన్నారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్, తదితర వ్యాధులతో బాధపడేవారు ఎంతమంది ఉన్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.డాక్టర్ లీలాలక్ష్మీ, సీహెచ్‌వో దేవదాసు, హెచ్‌ఎస్ కృష్ణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య కనకదుర్గ, మణి, ఏఎన్ ఎంలు రత్నకుమారి, శశి వెంకటేశ్వరి, సంధ్య, హెల్త్ అసిస్టెంట్‌లు దుర్గారావు, రంగారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాపులకూ ప్రత్యేక మేనిఫెస్టో ప్రకటించాలి : జోగయ్య

పాలకొల్లు, మార్చి, 19 : జయహో బీసీ సభ ద్వారా బీసీలకు కల్పించిన సౌకర్యాలను కాపులకు కూడా సమానంగా మేనిఫెస్టోలో ప్రకటించాలని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఒక లేఖలో కోరారు. 52 శాతం ఉన్న బీసీలకు ప్రత్యేక మేనిఫెస్టో ద్వారా 11 సంక్షేమ ఫలాలను ప్రకటించినట్లుగానే 25 శాతం ఉన్న కాపులకు కూడా సౌకర్యాలు కల్పిస్తూ మేనిఫెస్టో ప్రకటించాలని కోరారు.



కరుగోరుమిల్లి ర్యాంప్‌లో ఇసుక తవ్వకాలు

ఆచంట, మార్చి 19: నియోజకవర్గంలో సిద్దాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి నాలుగు ర్యాంప్‌లు కూడా కొన్ని నెలలుగా మూతపడ్డాయి. దీంతో అక్రమార్కులు ఇసుక దందాకు పాల్పడ్డారు. అయితే ఇటీవల ఆచంట మండలంలోని కరుగోరు మిల్లి ర్యాంప్‌కు సంబంధించి అనుమతులు రావడంతో ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఈ ర్యాంప్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుక ఎగుమతులతో బిజీగా మారింది.ఆరు యూనిట్లకు రూ.10,500, ఐదు యూనిట్లకు రూ.9,500 వసూలు చేస్తున్నారు. అయితే ఈ ర్యాంప్ వద్ద బాట పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే కొంతమంది మాత్రం ఈ ర్యాంప్‌కు ఎటువంటి పర్మిషన్‌లు లేకుండానే ప్రారంభించారని చెబుతున్నారు. అయితే ర్యాంప్ నిర్వాహకులు మాత్రం పూర్తిస్థాయిలో అన్ని అనుమతులు తీసుకునే ర్యాంప్ ప్రారంభించినట్లు చెబుతున్నారు.

పెండ్లికుమార్తెగా జలదుర్గ అమ్మవారు



కైకలూరు, మార్చి 19: కొల్లేటి కోట పెద్దింటమ్మ జాతర మహోత్సవాల్లో మంగళ వారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మ వారిని దర్శించుకున్నారు. జలదుర్గ (పెద్దింటమ్మ) అమ్మ వారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఈ సందర్భంగా కలశపూజ, కుంకుమపూజలు, పంచ హారతులిచ్చారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ భుజబలపట్నానికి చెందిన ముదునూరి వెంకట శ్రీనివాసరాజు, నాగజ్యోతి, ఆకివీడుకు చెందిన పెన్మెత్స నాగ వెంకట పాండు రంగారావు, వెంకటలక్ష్మి దంపతులు చేశారు.

వదల బొమ్మాళీ !

ఇంకా తొలగని బొమ్మలు..రంగులు

బహిరంగ ప్రదేశాల్లో కనిపిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు

కోడ్ అమలులో నిర్లక్ష్యంపై విమర్శలు


ఏలూరులో సెంట్రల్ లైట్లకు వైసీపీ రంగులతో విద్యుద్దీపాలంకరణ

ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చి మూడురోజులు గడిచినా అధికార యంత్రాంగం మేల్కోలేదు. ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో మీన మేషాలు లెక్కిస్తున్నారు. పలుచోట్ల వైసీపీ ప్రచార పోస్టర్లు, సచివాలయాలు, ఆర్బీకేలపై బ్యానర్లు తొలగించడంలో , విగ్రహాలకు ముసుగులు వేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు శనివారం షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ అమల్లోకి వచ్చింది.24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయపార్టీల ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించాల్సి ఉంది. నేతల విగ్రహాలకు ముసుగులు వేయాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల నిబంధనలు అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏలూరు రూరల్, మార్చి 19: ఏలూరు రూరల్ చొదిమెళ్ళ రైతుభరోసా కేంద్రానికి ఇప్పటికి వైసీపీ రంగులు తొలగించలేదు. శనివారపుపేట, శ్రీరామ్ నగర్, 12వ రోడ్డులోని సచివాలయంలో జగనన్న ఆరోగ్యశ్రీకి సంబంధించి ఫ్లెక్సీలు తొలగించలేదు. శ్రీరామ్‌నగర్ మూడోరోడ్డులో ఉన్న జగనన్న హెల్త్ క్లినిక్‌కు సంబంధించి బోర్డులు తొలగించలేదు. ఏలూరు మున్సిపాల్టీ పరిధిలో డివైడర్ మధ్యలో వైసీపీ రంగులతో కూడిన విద్యుత్ అలంకరణ నేటికి తొలగించకపోవడం, జిల్లాపరిషత్‌లోని ఇందిరమ్మ విగ్రహానికి ముసుగు వేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ అంటే ఆచితూచి వ్యవహరిస్తున్నారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా 24గంటల్లో

ప్రభుత్వ కార్యాలయాల్లో కోడ్ అమలుకు చర్యలు తీసుకున్నప్పటికి బహిరంగ ప్రదేశాల్లో మాత్రం దృష్టి సారించలేదు. విగ్రహాలపై ముసుగు వేయకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు క్రైం : ఏలూరు నగరంలో కొంత మంది ప్రజా ప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు సంబంధించి హోర్డింగులను ఏర్పాటు చేశారు. వాటిపై అధికారులు ఇంకా దృష్టి పెట్టలేదు. దుగ్గిరాల దగ్గర నుంచి ఏలూరు నగరంలోకి వచ్చే మార్గంలో వివిధ బోర్డులు, వైసీపీ ప్రజా ప్రతినిధుల చిత్రాలు ఉన్నప్పటికీ తొలగించలేదు. కొంత మంది తమ వాహనాలపై ప్రజా ప్రతినిధుల ఫోటోలతో తిరుగుతూనే ఉన్నారు. ఇలాంటి వాహనాలపై ఇప్పటి వరకూ కూడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదంటే అధికార పార్టీ కనుసన్నల్లోనే అధికారులు పనిచేస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి.

పెంటపాడు : మండలంలోని దర్శిపర్రు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని కమ్యునిటీ భవనంలో నిర్వహించేవారు. ఇటీవల నూతన భవనం నిర్మాణం చేసిన తరువాత కేంద్రాన్ని ఆ భవనంలోకి మార్చారు. అయితే కమ్యునిటీ హాల్ భవనానికి వైసీపీ రంగులు వేశారు. వాటిని మాత్రం నేటికి మార్చలేదు. ఈ భవనం పక్కనే జడ్పీ ఉన్నత పాఠశాల ఉంది. ఎన్నికలలో ఈ పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. మండలంలోని రాచర్ల రైతు భరోసా కేంద్రంలో కూడా ఇదే పరిస్థితి. ఈ భవనానికి కూడా వైసీపీ రంగులు వేశారు. మండలంలో చెత్త ను తీసుకువెళ్ళే రిక్షాలకు కూడా వేసిన వైసీపీ రంగులను ఇంకా తొలగించలేదు. మండలంలోని రావిపాడు గ్రామంలో రావిపాడు నుంచి అలంపురం జాతీయ రహదారి వరుకూ వెళ్లే వంతెన వంతెనపై కూడా వైసీపీ రంగులు వేశారు. కోడ్ వచ్చినా నేటికి వీటినీ తొలగించలేదు.

పోలవరం : పోలవరం మండలంలో గ్రామాల ముఖద్వారాలు, శివార్లలో ఉన్న మండల పరిషత్ బోర్డులపై ఉన్న జగన్ ఫోటోలపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా ఉన్నాయి. స్థానిక ఎంపీపీ వాహనంపై జగన్ బొమ్మ, వైసీపీ జెండా తొలగించలేదు.ఎన్నికల నియమావళి ఇతర పార్టీలకేనా అధికార పార్టీ నాయకులకు వర్తించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



దర్శిపర్రు పాత రైతు భరోసా కేంద్ర భవనానికి వేసిన వైసీపీ రంగులు


పోలవరంలో ముసుగు వేయని మండల పరిషత్ బోర్డు


ఏలూరు జడ్పీ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ విగ్రహానికి ముసుగువేయని దృశ్యం


రావిపాడులో వంతెనకు వైసీపీ రంగులు


చొదిమెళ్లలో రైతు భరోసా కేంద్రం

ముసుగు తొలగించారు



పెంటపాడు : ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'వాటిని వదిలేసి వీటికి ముసుగేశారు' కథనంపై అధికారులు స్పందించారు. పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న స్వాతంత్ర్య సమర యోధుడు లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి వేసిన ముసుగు తొలగించారు. కళాశాలలో ప్రజా ప్రతినిధుల పేరుతో ఉన్న శిలా ఫలకాలకు ముసుగు వేశారు.


సదస్సులో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

విచక్షణతో ఓటు వేస్తేనే సమాజంలో మార్పు

రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్

తణుకు, మార్చి 19 : ప్రతి ఒక్కరు విచక్షణతో ఓటు వేస్తేనే సమాజంలో మార్పు వస్తుందని రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛాయుత ఎన్నికలు-పౌర సమాజం' పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికైన పాలకులు పౌర సమాజం కోసం పనిచేయాలని చెప్పారు. తిరుపతి ఉప ఎన్నికల్లో 35 వేల దొంగ ఓట్లు సృష్టించి ఎన్ని కల్లో ఓట్లు వేశారని దొంగ ఓట్ల కట్టడి విషయంలో సిటిజన్ డెమోక్రసీ సంస్థ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం ద్వారా విజయం సాధించామన్నారు. ఎన్నికల్లో వలంటీర్లను దూరంగా ఉంచాలని, ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లో ఉంచాలని చేసిన కృషి ఫలితం ఇచ్చిందన్నారు. దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలను బలపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ రానున్న 20 ఏళ్లలో యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మేధావులు మేల్కొని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి మాట్లాడుతూ నేటి యువత మంచి నిర్ణయం తీసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల వారిని సరైన నిర్ణయం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగించుకున్నప్పుడే ప్రశ్నించే హక్కు ఉంటుందని, అనేక కారణాలతో యువత ఓటు హక్కుకు దూరంగా ఉంటున్నారన్నారు. చిట్టూరి రీనాసాయి, విశ్రాంత అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థునులు పాల్గొన్నారు.


రిటర్నింగ్ అధికారి నారాయణరెడ్డిని కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తహసీల్దార్ కార్యాలయంలోనే నామినేషన్ ప్రక్రియ జరగాలి : ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు టౌన్, మార్చి, 19 : పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలోనే జరిగితే బాగుంటుందని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి బీఎస్ నారాయణరెడ్డిని కలిశారు.ఎన్నికల కోడ్‌కు సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల అభిమానంతో కొందరు సొంత ఇళ్లకు కట్టిన ఫ్లెక్సీలను, బ్యానర్లను అనుమతి తీసుకునే ఏర్పాటు చేశామని, కొందరు అధికారులు అత్యుత్సాహంతో వైట్‌వాస్ వేసి పాడుచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇళ్లదారుల అనుమతి ఉంటే ఏర్పాటు చేసుకోవచ్చనీ, అయితే ఖర్చు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎప్పటినుంచో ఎన్నికల నామినేషన్ల నిర్వహణ తహసీల్దార్ కార్యాలయంలో జరిగేదనీ, ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలోకి మార్పు చేయడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయం ప్రధాన రహదారి వెంబడి ఉండటం వల్ల ఎన్నికల ప్రక్రియ జరిగే 20 రోజులు పాటు ఆ రహదారిని బారిగేడ్లతో బంద్ చేసి దుకాణాలు సైతం మూసి వేస్తారని దీని వలన వర్తకులకు, ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారికి పాలకొల్లు చాంబర్ వినతిపత్రం ఇచ్చిందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగేలా చూడాలని ఎమ్మెల్యే నిమ్మల కోరారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, బొంతు తిరుమలరావు, బందెల భాస్కరరావు, జనసేన నాయకుడు రామలింగేశ్వరరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి లక్ష్మీనరసింహ నాగేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.


భీమవరం మండలం లోసరి జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

చెక్ పోస్టులు 24 గంటలు పనిచేయాలి : జేసీ ఆదిత్య

రూ. 50 వేలు దాటితే ఆధారాలు తప్పనిసరి

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



భీమవరం రూరల్ /ఆకివీడు/ ఉండి మార్చి 19 : చెక్ పోస్టులు 24 గంటలు సమర్థవంతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. మంగళవారం భీమవరం మండలం లోసరి గ్రామం జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను వాహనాలలో తరలించకుండా కట్టడి చెయ్యాలన్నారు. మాదివాడ సెంటర్‌లో జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ వాహనాలు తనిఖీలు నిర్వహించారు. రూ.50 వేలు నగదు దాటితే ఆధారాలు తప్పనిసరన్నారు. ముఖ్యమైన వస్తువులు తీసుకెళుతున్నా వాటికి ఆధారాలుండాలన్నారు.ఆధారాలు లేనిచే సీజ్ చేస్తామన్నారు. ఎస్ఐ బత్తిన నాగబాబు కూడా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఉండిలో అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఉండి నుంచి ఆకివీడు వైపు వెళ్తున్న కార్లను తనిఖీ చేశారు కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర, ఈవోపీఆర్‌డీ, ఎఎస్ఐ తదితరులున్నారు.

రూ.2.88 లక్షలు నగదు స్వాధీనం



వీరవాసరం, మార్చి 19 : ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ జాతీయ రహదారిపై చేసిన తనిఖీల్లో రూ.1.62 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం 165వ జాతీయ రహదారిపై చేసిన తనిఖీల్లో చించినాడ గ్రామానికి చెందిన ఖండవల్లి ఇందు, సుమన్ దంపతులు ప్రైవేటు కారు తనిఖీ చేయగా రూ.1.62 లక్షలు లభించిందని ఆ సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు సభ్యులు రీసర్వే నాగేశ్వరరావు, ఏఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వీరవాసరం మండల కార్యాలయంలోని ఏఆర్‌వోలు సుశీలా దేవి, విజయసారథిల వద్ద హాజరుపరచికి నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. భీమవరంలో కుట్టు మిషన్లు కొనుగోలు చేసేందుకు నగదు తీసుకెళ్తున్నామని బాధితులు అధికారుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకెళ్లడం నేరమని, నగదుకు సంబంధించిన ధ్రువపత్రాలను జిల్లా కేంద్రంలోని సీజ్డ్ మోనిటరింగ్ కమిటీ వద్ద సమర్పించి నగదు తిరిగి పొందవచ్చునని తెలిపారు.

సిద్ధాంతంలో రూ. 1.26 లక్షలు

ఆచంట :సిద్ధాంతంలో సోమవారం రూ. 51,600, మంగళవారం రూ.74,500 రూపాయలు అధికారులు పట్టుకున్నారని ఈ సొమ్మును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి స్వామినాయుడు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా 50 వేల రూపాయలు కంటే ఎక్కువ నగదు ఎటువంటి పత్రాలు లేకుండా ఉంటే అటువంటి నగదును సీజ్ చేస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని ఇద్దరి మృతి

భీమవరం క్రైం, మార్చి 19 : భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ (జీఆర్‌పీ) పరిధిలో గుర్తుతెలియని ఇద్దరు మృతి చెందారు. సుమారు 40 సంవత్సరాల మగ వ్యక్తి గుర్తు, లక్ష్మీనారాయణపురం హాల్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 45 సంవత్సరాలు ఉన్న మరో మహిళ రైలు ప్రమాదంలో మరణించినట్లు ఎస్ఐ పీటీవీ రమణ తెలిపారు. పసుపు రంగు మీద నీలం తెలుపు రంగు అడ్డచారల పొడుగు చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎడమ తొడపై నల్లని పుట్టుమచ్చ ఉందన్నారు. మహిళ నీలం రంగు మీద తెలుపు పూల డిజైన్ కాటన్ చీర, గులాబీ రంగు జాకెట్ ధరించి ఉందని, ఆమె మెడలో ఒంటిపేట పసుపు తాడు ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 70939 39777 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని దుర్మరణం

ఏలూరు క్రైం, మార్చి 19 : మోటారు సైకిల్‌పై తల్లిని ఎక్కించుకుని అమ్మమ్మ ఇంటి నుంచి వెళ్తుండగా మార్గమధ్యలో ఒక క్రాస్ రోడ్డు వద్ద అతి వేగంగా వచ్చిన ఆటో వెనుక నుంచి ఢీ కొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలతో తల్లి బయటపడింది. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామానికి చెందిన మాత్రపు నాగమణికి భర్త కొన్నేళ్ళ క్రితం మరణించగా తన ఇద్దరు కుమారులతో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. చిన్న కుమారుడు సుబ్బారావు (21) తన పల్సర్ మోటారు సైకిల్‌పై తల్లి నాగమణిని ఎక్కించుకుని ఏలూరు సమీపంలోని వట్లూరుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గవర్నమెంట్ ఐటీఐ క్రాస్‌రోడ్డు వద్ద వట్లూరు నుంచి ఒక ఆటో అతి వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది.తీవ్ర గాయాలైన సుబ్బారావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 19 : భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందని ఒక వ్యక్తి తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు బీడీ కాలనీ గట్టు ప్రాంతానికి చెందిన చిప్పాడ యర్రవరప్రసాద్ (28)కు భార్య నిష, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నాడు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజుల క్రితం అనూష తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన వరప్రసాద్ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లింగపాలెం అడవిలో గుర్తు తెలియని మృతదేహం

లింగపాలెం, మార్చి 19:లింగపాలెం మండలం లింగపాలెం, పాతిమాపురం మధ్యలో ఉన్న అడవిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఫారెస్ట్ గార్డుగా పనిచేస్తున్న పుల్లారావు అనేవ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుళ్ళిపోయి గుర్తుతెలియని స్థితిలో ఉన్న మృతునికి సుమారు 42 నుంచి 50 లోపు వయసు ఉంటుందని ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 19 : వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాల లేదంటూ అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన భర్తతో పాటు అత్త, మామలు, ఇద్దరు ఆడపడుచులపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని పాండురంగపురానికి చెందిన చిరువోలు దుర్గా భవానీకి 2016లో నూజివీడు మండలం విసన్నపేట అగ్నిమాపక శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న యజ్ఞనారాయణతో వివాహం అయింది. వీరికి ఒక కుమార్తె ఉంది. ఇటీవల కట్నం కోసం వేధింపులకు గురి చేసి అత్తింటి నుంచి పంపించి వేశారు. అప్పటి నుంచి ఆమె పుట్టింటి వద్దే కుమార్తెతో ఉంటున్నది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు భర్త యజ్ఞనారాయణ, అత్త వీరమ్మ, మామ వెంకటేశ్వరరావు, ఆడపడుచుకుల వరలక్ష్మి, నాగసరోజినీలపై కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌లో దొంగల్ని పట్టుకున్న ప్రయాణికులు

నరసాపురం, మార్చి 19: నరసాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు మహిళల్ని ప్రయాణికులు పట్టుకున్నారు. ఒక ప్రయాణికురాలు దగ్గర నుంచి సెల్‌ఫోన్, బ్యాగ్‌లోని బంగారాన్ని దొంగలిస్తుండగా వెనుక ఉన్న ప్రయాణికులు పట్టుకున్నారు. దీంతో ఆమెకు సహకరించిన మరో నలుగురు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వీరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

రెండు ఆటోలు ఢీ..కూలీలకు గాయాలు

జంగారెడ్డిగూడెం, మార్చి 19 : జంగారెడ్డిగూడెం ఎస్‌ఆర్ బంక్ వద్ద మంగళవారం రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో వ్యవసాయ కూలీలకు గాయాలయ్యాయి. కొయ్యలగూడెం మండలం పొంగుటూరుకు చెందిన వ్యవసాయ కూలీలు 12 మంది జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం పొగాకు పనుల కోసం వెళ్లారు. పనులు ముగించుకుని వస్తుండగా బైపాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఓ మహిళ ద్విచక్రవాహనంతో అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో ఆటోను పక్కకు తిప్పాడు. పైప్‌ల లోడుతో ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో డ్రైవర్ ముత్యంతో సహా ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు 108, వేరొక ఆటోలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఆటో డ్రైవర్ ముత్యంను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కూలీలలో మర్లపూడి కళావతి, జగ్గు రమేష్‌లను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


చికిత్స పొందుతున్న గాయపడ్డ కూలీలు





నా భర్త ఆచూకీ చెప్పండి

అమ్మపాలెంలో రహదారి పక్కన దీక్ష

జంగారెడ్డిగూడెం, మార్చి 19: భర్తను దాచిపెట్టి తన కాపురాన్ని నాశనం చేస్తున్నారని తన భర్త ఆచూకీ తెలపాలని భార్య ఆందోళనకు దిగింది. జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన దుర్గా భవానీ అమ్మపాలెం వెళ్లే రహదారి పక్కన మంగళవారం దీక్ష చేపట్టింది. విషయం తెలుసుకున్న లక్కవరం ఎస్ఐ సుధీర్ దీక్ష కొనసాగుతున్న ప్రాంతానికి వెళ్లి ఆమెతో మాట్లాడి సమస్య అడిగారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లికి చెందిన తనకి జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన డొక్కా రామాంజనేయులుకి 2023లో వివాహం జరిగిందన్నారు. వివాహం జరిగిన కొన్ని నెలలకే అత్త, మామ ఆడపడుచు, ఆడపడచు భర్త కానిస్టేబుల్ తనపై వేధింపులకు పాల్పడటం మొదలుపెట్టారన్నారు. దీనిపై ద్వారకాతిరుమల, ఏలూరు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయగా అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. మూడు నెలలు బాగానే ఉన్నామని శివరాత్రి నాటి నుంచి తన భర్తను దాచిపెట్టి తన వద్దకు రాకుండా చేశారని తన భర్తను తన వద్దకు తీసుకొచ్చి అప్పగించేంత వరకు దీక్ష విరమించేది లేదని పోలీసులకు చెప్పింది.

జనసేన తెలంగాణ నేత గెలుపు యాత్ర



ధర్మరాజును కలసిన తెలంగాణ జనసేన నేత

ఉంగుటూరు, మార్చి 19: జనసేన పార్టీ విజయం కోరుతూ తెలంగాణకు చెందిన నేత దీపక్ గెలుపు యాత్ర పేరుతో పర్యటిస్తున్నారు. జనసేన పోటీ చేస్తున్న 21 స్థానాల్లో విజయం సాధించాలని కోరుతూ దీపక్ పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఆయన పర్యటనలో భాగంగా ఉంగుటూరు జనసేన కార్యాలయంలో ప్రస్తుత జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజును మంగళవారం ఆయన కలిశారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని రాష్ట్రాన్ని కాపాడాలనికి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ధర్మరాజు విజయం సాధించాలని దీపక్ ఆకాంక్షించారు.

పోలవరం మండలంలో చిర్రి బాలరాజు పర్యటన



సహాయమందిస్తున్న చిర్రి బాలరాజు

పోలవరం, మార్చి 19: జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు మంగళవారం మండలంలో పర్యటించారు. ఎల్ఎన్‌డీ పేటలో ఇటీవల ప్రమాదంలో గాయపడిన పులిబోయిన వెంకటేశ్‌ను పరామర్శించారు. కుటుంబం ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు. జనసేన, టీడీపీ బీజేపీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పోలవరం మండల కేంద్రంలో పర్యటించారు. కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలనాన్నరు. ఆయన వెంట టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు : డీసీపీవో



కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీవో సూర్యచక్రవేణి

పెదవేగి, మార్చి 19: కనీస వయస్సు రాకుండా బాలలకు వివాహం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణాధికారి (డీసీపీవో) సూర్యచక్రవేణి హెచ్చరించారు. వేగివాడలో 14ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారనే సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ యూనిట్, ఐసీడీఎస్, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయం అధికారులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి తక్షణం స్పందించారు. బాల్య వివాహాన్ని ఆపడమే కాకుండా బాలిక తల్లిదండ్రులు, వరుని తల్లిదండ్రులను మంగళవారం ఏలూరులోని బాలల సంరక్షణ కార్యాలయానికి పిలిపించి అవగాహన కల్పించారు. సూర్యచక్రవేణి మాట్లాడుతూ కనీస వయస్సు లేకుండా వివాహం చేస్తే బాలికతో పాటు పుట్టే శిశువుకూడా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకుని, సరైన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని చూస్తే బాల్య వివాహ నిరోధక చట్టం- 2006 ప్రకారం బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ - 1098కి సమచారం అందించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ -1098 కోఆర్డినేటర్ వైవీ.రాజు తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వధువు, వరుడు తల్లిదండ్రులనుంచి బాల్య వివాహం చేయబోమని ఒప్పంద పత్రం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీవో కె.విజయలక్ష్మి, విజయరాయి సెక్టారు సూపర్‌వైజర్ మేరీ బాయమ్మ, వేగివాడ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి గీతిక, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక యోగా తరగతులు



సూచనలిస్తున్న సీడీపీవో పద్మావతి

ఏలూరు రూరల్, మార్చి 19: కొత్తపేట చోడిదిబ్బ ప్రాంతంలోని జయప్రకాష్ సెంటర్, రెష్మత్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భవతులకు మంగళవారం ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు. పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. సీడీపీవో ఎ.పద్మావతి మాట్లాడుతూ గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహార ప్రాధాన్యత, శారీరక, మానసిక ప్రశాంతత తగిన విశ్రాంతి తీసుకోవాలని తెలియజేశారు. కొత్తపేట యూహెచ్‌సీ వైద్యులు శశాంక్ మాట్లాడుతూ గర్భవతులు ఎక్కువగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కేవీఎస్.నాగమణి, ఏఎన్ఎం దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నవతి, కె.ఝాన్సీలక్ష్మి, షామీమ, డి.నాగదేవి, భవాని, ఆశా వర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎ.గోకవరం, గోపరాజుపాడులో ఫీవర్ సర్వే



నీటి నిల్వతో నష్టాలు వివరిస్తున్న వైద్యుడు

ఉంగుటూరు, మార్చి 19: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రోగాల నుంచి రక్షణ పొందవచ్చని వైద్య సిబ్బంది సూచించారు. తాడేపల్లిగూడెం ఉప ఆరోగ్య అధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి వాటి ద్వారా వచ్చే వ్యాధులను స్థానికులకు వివరించారు. డ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ ఆరోగ్య కార్యదర్శులు సరోజిని, శ్రావణి, ఆశాలు ఎస్.రాణి, జి.రాణి పాల్గొన్నారు.

వెన్ను నొప్పి సమస్యలపై జాగ్రత్తలు పాటించాలి



మందులు అందిస్తున్న వైద్యులు

ఉంగుటూరు, మార్చి 19: వెన్నెముక సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు పాండ్రాకుల తేజో ఫణీంద్ర అన్నారు. కైకరంలో మానవత, రాజమహేంద్రవరం వేద స్పైయిన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెన్నునొప్పి నివారణకు వైద్యులు పలు సూచనలు ఇచ్చారు. జడ్పీటీసి కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ పేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 236 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుప్పాల గోపి, గంజి రవి, ఎంపీటీసీ పంతుల వెంకన్నబాబు, ఉప సర్పంచ్ మట్టా మురళి, గుణ్ణం బుల్లెబ్బాయి, శీతాల సత్యనారాయణ, కోనే సత్యనారాయణ, గుత్తికొండ వెంకట కృష్ణారావు, రంధి జయ, అనిల్, ప్రభాకరరావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పెదపాడు, మార్చి 19: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రధర్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద మంగళవారం శిబిరాన్ని ఏర్పాటుచేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జయపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది వివరాలు నమోదు చేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 19: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు వారి వద్ద పనిచేస్తున్న స్టాఫ్‌నర్సుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)లో విధిగా నమోదుచేయాలని డీఎంహెచ్‌వో శర్మిష్ట మంగళవారం తెలిపారు. ఇదే పోర్టల్‌లో ప్రైవేటు క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. నమోదుచేయని ఆస్పత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్ల రెన్యువల్‌ను నిలిపివేస్తామని, కొత్త సెంటర్ల రిజిస్ట్రేషన్లు చేయబోమని హెచ్చరించారు.

'పోలవరం అసెంబ్లీ స్థానం టీడీపీకే కేటాయించాలి'

బుట్టాయగూడెం, మార్చి 19: పోలవరం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ఓటింగ్ శాతం ఎక్కువని, టీడీపీకే టికెట్ కేటాయించాలని నాయకులు కోరారు. తెల్లం వెంకటేశ్వరావు, మొడియం సింగరాజు, మడకం రామకృష్ణ, కోర్స వెంకటేశ్వరావు, బాడిస ముత్యాలరావు, చోడెం అర్జున్, సున్నం నాగేశ్వరరావు, పాయం అరుణ్‌కుమార్ పూసం ముక్కమ్మ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పోలవరం నియోజకవర్గంలో పలుమార్లు టీడీపీ గెలవగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికయ్యారని, నియోజకవర్గంలో ఏ పార్టీ గెలిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. జనసేనకు ఓటు శాతం తక్కువగా ఉన్నందున ఎక్కువ ఓటు శాతం ఉన్న టీడీపీకే టికెట్ ఇవ్వాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. టీడీపీకి సీటు ఇస్తే అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని తెలిపారు.





భీమడోలు, పెదవేగి, బుట్టాయగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్, బొరగం శ్రీనివాసులు

ప్రధాని సభలో
భద్రతా వైఫల్యం

పోలీసు అధికారులపై విచారణ జరిపించాలి
టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని, నేతల డిమాండ్

భీమడోలు / పెదవేగి / బుట్టాయగూడెం, మార్చి 19 : ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంలో పోలీసుల పాత్రపై సమగ్ర విచారణ చేయాలని టీడీపీ జిలాల్ల అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, నేతలు చింతమనేని ప్రభాకర్, బొరగం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు వేర్వేరు చోట్ల విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. దేశ ప్రధాని పాల్గొన్న సభకు సరైన భద్రత కల్పించకపోవడం దారుణమని గన్ని వీరాంజనేయులు అన్నారు. ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లక్షలాది మంది జనం తోసుకు వస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం నడిచారా, పోలీసులు కావాలని చేశారని అనేది తేలాలన్నారు. సభ భద్రతా వైఫల్యంపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో చిలకలూరిపేట సభ ద్వారా స్పష్టమైందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు సభను బ్రహ్మాండంగా విజయవంతం చేశారని గన్ని పేర్కొన్నారు.

దేశ ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ పాల్గొన్న సభకు కల్పించాల్సిన భద్రతా ఇదేనా అని ప్రభాకర్ ప్రశ్నించారు. కొంతమంది పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగా సభకు అడ్డంకులు సృష్టించారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుని, ఎన్నికల విధులకు దూరం పెట్టాలని ప్రభాకర్ కోరారు. అరాచక పాలనకు అంతం పలుకుదామని ప్రధాని పిలుపునిచ్చారంటే రాష్ట్రంలో పాలనపై ప్రధాని ఎంతగా స్పందించారో అర్థమవుతుందన్నారు. ప్రజాగళం సభకు లక్షలాది మంది జనం తోసుకువస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారని బొరగం శ్రీనివాసులు విమర్శించారు. ట్రాఫిక్ సమస్యతో వేలాది మంది సభకు రాలేకపోయారని తెలిపారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి ఆగిపోయిందని, అవినీతి, దోపిడీలో వైసీపీ నేతలు పోటీ పడినట్లు ప్రధాని స్పష్టం చేశారన్నారు. ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏస్థాయిలో ఉందో చిలకలూరిపేట సభ ద్వారా తెలుస్తుందని అరాచక పాలనకు అంతం పలకడమే కూటమి లక్ష్యమన్నారు.

టీడీపీ కూటమిని ఆశీర్వదించండి : బడేటి

ఏలూరు టూటౌన్: భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం ఏకమైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ప్రజలంతా ఆశీర్వదించాలని కూటమి ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 23, 24డివిజన్స్‌లో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను చంటి ప్రజలకు వివరిస్తూ కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు తెలియజేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 పథకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే కూటమిని గెలిపించాలన్నారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. విజయలక్ష్మి, రంజిత్, సీహెచ్ గణేష్, లంకపల్లి మాణిక్యాలరావు, కోనేరు శ్రీలక్ష్మి, భీమవరపు సురేష్, వేమూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే బీసీలకు మేలు

చింతలపూడి: తిమ్మిరెడ్డిపల్లిలో టీడీపీ నాయకులు ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. చిలకబత్తుల మోహన్‌రావు మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని, గతంలోనూ మేలు కలిగిందని వివరించారు. మహిళలకు నెలకు రూ.1500, ఉచితంగా మూడు గ్యాస్ బండలు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రూ.20వేలు సాయం వంటి పథకాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు కందుల కృష్ణారావు, వీధి భుజంగరావు, స్వర్ణాల మోహన్‌రావు, పలువురు పాల్గొన్నారు.



ఏలూరులో బడేటి చంటికి హారతి ఇస్తున్న మహిళ



లింగపాలెం మండలంలో టీడీపీ, జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు

తెలుగుదేశం, జనసేనలోకి చేరికలు

లింగపాలెం: బోగోలు, వెంకటాపురం గ్రామాల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు తెలియజేశారు. వెంకటాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, బొంతు గిరిబాబు చౌదరి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని సొంగా రోషన్ కుమార్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బోగోలులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఉల్లిపాయల సత్యనారాయణ తన అనుచరులు సుమారు వంద మంది జనసేనలో చేరారు. రోషన్‌కుమార్, ఈశ్వరయ్య వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పలు గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. జనసేన కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, ఘంటా మురళీ రామకృష్ణ, మేకా ఈశ్వరయ్య, జగ్గవరపు ముత్తారెడ్డి, గుత్తా సత్యసాయి వరప్రసాద్, ముసునూరి రాము, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, కూరపాటి వెంకటేశ్వరరావు, రాయంకుల చక్రధర్‌రావు, ముత్యాల రాధాకృష్ణ, గరిమెళ్ళ చలపతిరావు, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, మాదాసు కృష్ణ, పలువురు నాయకులు, గ్రామస్థులు హాజరయ్యారు.

సరిహద్దు చెక్‌పోస్టులలో తనిఖీలు



లింగపాలెం మండలంలో వహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

చింతలపూడి, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆంధ్రా సరిహద్దు అల్లిపల్లి లింగగూడెంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను మంగళవారం నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.అద్దయ్య పర్యవేక్షించారు. కొన్ని వాహనాలను తనిఖీ చేశారు. రాష్ట్ర సరిహద్దు కావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. బహుమతులు వస్తువు రూపంలో ఇచ్చేందుకు చీరలు వంటివి తరలిస్తూ ఉంటారని, వాటిపై సమాచారం ఇవ్వాలని నగదు పై కూడా పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ, సీఐ సుధాకర్ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఎన్నికల నేపథ్యంలో అనుమతిలేని నగదు, వస్తువులు తరలించడం నిబంధనలకు విరుద్ధమని చేబ్రోలు ఎస్ఐ మణి కుమార్ అన్నారు. జాతీయ రహదారిపై నారాయణపురం, ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఆయనతో పాటు నిడమర్రు సర్కిల్ పరిధిలోని చేబ్రోలు, నిడమర్రు ఎస్ఐలు వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

లింగపాలెం: అధికారులు, రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళిని అనుసరించాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. అధికారులు ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామాల్లో వివిధ పార్టీల ప్లెక్సీలు, వాల్‌పోస్టర్‌లను తొలగించారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలపై రాజకీయ పార్టీల చిత్రాలను దగ్గరుండి తొలగించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఉల్లంగించిన వారి పై కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండాలని, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులు సహకరించాలని కోరారు.

మండలంలో డిప్యూటీ తహసీల్దార్ కె.సునీత ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ నగదుకు సరిపడా రశీదు పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం అక్రమ రవాణా చేసిన రశీదులు, సరైన పత్రాలు లేకుండా నగదుతో దొరికినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆమెతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ఉంగుటూరు, మార్చి 19: దెందులూరు మండలం గుండేరు వాగు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన దానేటి యుగంధర్ శ్రీనివాస్(22) ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

ముసునూరు, మార్చి 19: పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన అంగడాల భవాని (34) ఐదు రోజుల క్రితం ముసునూరు మండలం కాట్రేనిపాడులోని తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 17న తండ్రి పిన్నిబోయిన వీరయ్య తోటలో కూలీలతో కలసి మొక్కజొన్న కండెలను విరుస్తుండగా ఆమెను పాము రెండుసార్లు కాటువేసింది. నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై పి.వాసు కేసు నమోదు చేశారు.

కౌలు రైతుల సమస్యలపై పోరాటం

పెదపాడు, మార్చి 19: కౌలురైతుల సమస్యల పరిష్కార దిశగా పోరాటం చేయడానికి కౌలు రైతులు సమాయత్తం కావాలని, అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు గన్ను వెంకట్రావు తెలిపారు. పెదపాడులో జరగబోయే కౌలు రైతుల సమావేశంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కౌలురైతుల సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఏపీ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటుగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, మార్చి 19: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో 200 మందికి అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం



పూజలు చేస్తున్న గారపాటి చౌదరి దంపతులు

ఏలూరు టూటౌన్, మార్చి 19: తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామంజనేయ చౌదరి, రేణుక దంపతులు మంగళవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ్ నగర్ తపనా ఫౌండేషన్ కార్యాలయంలో చౌదరి దంపతులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తుల హనుమాన్ చాలీసా సంకీర్తనతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామి, చెన్ను శ్రీనివాసరావు ఆంజనేయులు, కొడూరి లక్ష్మీనారాయణ, గుమ్మడి చైతన్య, ఎం.కృష్ణారావు, పి.రఘు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కైకలూరు, మార్చి 19: వరహాపట్నంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ తెలిపారు. 22న కల్యాణం, 23న గరుడోత్సవం, కల్పవృక్ష సేవ, 24న చందనోత్సవం, నృశింహ యాగం, 25న శేషవాహనం, గజ వాహనంపై గ్రామోత్సవం, 26న అఖండ అన్నసమారాధన, స్వామివారి పవళింపుసేవ నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు వంశపారంపర్య ధర్మకర్తలు కామినేని పట్టాభిరామయ్య, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

కైకలూరు, మార్చి 19: గోనెపాడు గంగా పార్వతీ సమేత జలలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం హోమాలు శయ్యాధివాసం, ధాన్యాధివాసం ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. బుధవారం మహాగణపతి, నవగ్రహ, నాగదేవత, అయ్యప్పస్వామి, గంగాపార్వతీ సమేత జలలింగేశ్వరస్వామి యంత్ర, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించనున్నారు.



పోలవరం పరీక్షా కేంద్రంలో విద్యార్థులు



పెదవేగిలో పరీక్ష అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

పది పరీక్షలు రెండో రోజు ప్రశాంతం

పోలవరం, మార్చి 19 : మండలంలో పదో తరగతి పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. గూటాల ఉన్నత పాఠశాలలో 101 మంది విద్యార్థులకు 98 మంది, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మందికి 256 మంది, కార్మెల్ పురం సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో 30 మందికి 8 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీధర్ తెలిపారు.

● పెదవేగి: పదో తరగతి పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఆరు పరీక్ష కేంద్రాల్లో 912 మంది మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 825 మంది పరీక్షకు హాజరయ్యా రని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. 87మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. మొత్తంగా రెండోరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతం గా జరిగాయి. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట బందోబస్తుతోపాటు తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయం కల్పించామని ఎంఈవో వివరించారు.

● ఉంగుటూరు: పదవ తరగతి పరీక్షలలో రెండో రోజు హిందీ పరీక్షకు 21 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 711 మంది విద్యార్థులకు 688మంది హాజరయ్యారని ఎంఈవో కాంద్రేగుల శ్రీనివాసరావు తెలిపారు. సప్లిమెంటరీలో 50 మందికి 24 మంది హాజరైనట్లు వివరించారు.

'ఓపెన్' ఇంటర్ పరీక్షలకు 65 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్: జిల్లాలో మంగళవారం జరిగిన ఏపీ ఓపెన్ స్కూల్ దూరవిద్య ఇంటర్మీడియట్ జీవశాస్త్రం పరీక్షకు 302 మంది అభ్యాసకులు దరఖాస్తు చేసుకోగా 278మంది, వాణిజ్య శాస్త్రం పరీక్షకు 443 మందికి 402మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలను స్క్వాడ్ బృందాలు, ప్రభుత్వ పరిశీలకుడు ఆకస్మిక తనిఖీ చేశారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.



దివ్యబలి పూజ అర్పిస్తున్న బిషప్ జయరావు తదితరులు

పునీత జోసెఫ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

పెదవేగి, మార్చి 19: ధర్మ మార్గంలో నడిచిన పునీత జోసెఫ్ అందరికీ స్ఫూర్తిదాయకమని ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం సందర్భంగా మంగళవారం పునీత జోసెఫ్ పండుగ నిర్వహించారు. బిషప్ జయరావు మాట్లాడుతూ పునీత జోసెఫ్ జీవితం ఎంతో ఉన్నతమైందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మమార్గం వీడక ముందుకు సాగారన్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తే జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. ముందుగా బిషప్ జయరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలువురు గురువులతో కలసి దివ్యబలి పూజ సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి ఏడాది దంతవైద్య విద్యార్థులు పరిచయ కార్యక్రమం అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ ఎన్.స్లీవరాజు, సెయింట్ జోసెఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, దంతవైద్య కళాశాల ఏవో ఫాదర్ ఎల్.ఫెలిక్స్, ఫాదర్ ధర్మరాజు, కోశాధికారి ఫాదర్ బి.రాజు, అమలోద్భవి మాత విచారణకర్తలు ఫాదర్ ఐ.మైకేల్, కళాశాల అధ్యాపకులు, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయం హుండీ ఆదాయం రూ.1.10 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పెదవేగి, మార్చి 19: స్థానిక శివాలయం హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఏలూరు తనిఖీదారు బీఎల్.నరసింహరావు సమక్షంలో హుండీలను తెరిచి, ఆదాయాన్ని లెక్కించామని ఆలయ ఈవో కె.శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపులో మొత్తం రూ.1,10,341 ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు.

జనార్దనస్వామి తిరు కల్యాణోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 19. అగ్రహారంలో జనార్దనస్వామి ఆలయం వద్ద ఈ నెల 20 నుంచి 26 వరకు స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు తెలిపారు. బుధవారం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారన్నారు. 23న ఎదుర్కోలు సన్నాహం, స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు.

అగ్రహారంలోని శ్రీరామమందిరంలో పునర్వసు నక్షత్ర పూజలు చేశారు. అర్చక బృందం అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రాచూరు పల్లాలమ్మకు మహా కుంభాభిషేకం

ఉంగుటూరు, మార్చి 19: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. చండీ హోమం నిర్వహించి సాయంత్రం పుర వీధులలో అమ్మవారిని ఊరేగించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వైభవంగా మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు

కలిదిండి, మార్చి 19 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవా లు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసీరావు దంపతులు పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించు కున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ చైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

ఆగిరిపల్లి, మార్చి 19: అదనపు కట్నం వేధింపులపై బాధితురాలు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆగిరిపల్లికి చెందిన అంజలికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన పత్తిపాటి మృదంతో ఆరునెలల క్రితం వివాహమైంది. అదనపు కట్నం కోసం అత్తింటి వారు హింసిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తవేర్యా నాయక్ తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

లింగపాలెం, మార్చి 19: ధర్మాజీగూడెం కాటమరెడ్డిపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు టి.లక్ష్మణుడు (42) మంగళవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నారు. యూటీఎఫ్ నాయకుడిగా పని చేశారు. ఆయన మృతికి ఎంఈవోలు రామారావు, రవీంద్ర, పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు సంతాపం తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సుకై శ్రమించిన లక్ష్మణుడు మృతి బాధాకరమన్నారు. స్వగ్రామం ముసునూరు మండలం గోపవరంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.



నూర్పిళ్లకు సిద్ధమైన మినుముపై పరదాలు కప్పిన దృశ్యం

దేవుడా.. దేవుడా...

- వర్ష సూచనలతో మినుము రైతుల ఆందోళన
- ముమ్మరంగా మినుము నూర్పిళ్లు
- యంత్రాలకు డిమాండ్
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

ముదినేపల్లి రూరల్, మార్చి 19: ఆరుగాలం పంటను కష్టనష్టాలకోర్చి పంటను పండించడం ఒక ఎత్తయితే.. పండిన పంటను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుకోవడం అన్నదాతకు మరో ఎత్తు. వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతులు మినుము నూర్పిళ్ళు ముమ్మరంగా చేపట్టారు. రైతులు యంత్రాల కోసం ఎగబడటంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. యంత్రాల కొరతతో రైతులు చేసేదేమీ లేక మినప మేట్లపై పట్టాలుకప్పి భద్రపరుచుకుంటున్నారు. ఇప్పటికే అధిక శాతం గ్రామాల్లో 50 శాతంకు పైగా నూర్పిళ్ళు పూర్తయ్యాయి.

ఓటర్లు విలక్షణ తీర్పు ఇవ్వాలి



పుష్పావతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

ముదినేపల్లి, మార్చి 19 : రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని ఓటర్లు విలక్షణ తీర్పు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శాయిన పుష్పావతి అన్నారు. మంగళవారం ఆమె ముదినేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకునే బాధ్యత రాష్ట్ర ప్రజలదే అన్నారు. ఐదేళ్లుగా వైసీపీ పాలన రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందని, తిరిగి అభివృద్ధి గాడిలో పడాలంటే సమర్థవంతమైన పాలన అందించగల కూటమిని అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో తిరిగి అధికారంలోకి రానున్న ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అభివృద్ధి చేసి, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తారని ఆమె స్పష్టం చేశారు.

భర్త ఆచూకీ తెలపాలని దీక్ష



జంగారెడ్డిగూడెం, మార్చి 19: భర్తను దాచిపెట్టి తన కాపురాన్ని నాశనం చేస్తున్నారని తన భర్త ఆచూకీ తెలపాలని భార్య ఆందోళనకు దిగింది. జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన దుర్గా భవానీ అమ్మపాలెం వెళ్లే రహదారి పక్కన మంగళవారం దీక్ష చేపట్టింది. విషయం తెలుసుకున్న లక్కవరం ఎస్ఐ సుధీర్ దీక్ష కొనసాగుతున్న ప్రాంతానికి వెళ్లి ఆమెతో మాట్లాడి సమస్య అడిగారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లికి చెందిన తనకి జంగారెడ్డిగూడెం మండలం అమ్మ పాలెం గ్రామానికి చెందిన డొక్కా రామాంజనేయులుకి 2023లో వివాహం జరిగిందన్నారు. వివాహం జరిగిన కొన్ని నెలలకే అత్త, మామ ఆడపడుచు, ఆడపడచు భర్త కానిస్టేబుల్ తనపై వేధింపులకు పాల్ప డటం మొదలు పెట్టారన్నారు. దీనిపై ద్వారకాతిరుమల, ఏలూరు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయగా అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. మూడు నెలలు బాగానే ఉన్నామని శివరాత్రి నాటి నుంచి తన భర్తను దాచిపెట్టి తన వద్దకు రాకుండా చేశారని తన భర్తను తన వద్దకు తీసుకొచ్చి అప్పగించేంత వరకు దీక్ష విరమించేది లేదని పోలీసులకు చెప్పింది.

క్రైం కార్నర్

పాముకాటుకు గురైన మహిళ మృతి

ముసునూరు, మార్చి 19: పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై మంగళవారం ఎస్సై పి.వాసు కేసు నమోదు చేశారు. బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన అంగడాల భవాని (34) ఐదు రోజుల క్రితం ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలోని తన పుట్టింటికి వచ్చింది. ఈ నెల 17న తన తండ్రి పిన్నిబోయిన వీరయ్య తోటలో కూలీలతో కలసి మొక్కజొన్న కండెలను విరుస్తుండగా ఆమెను రక్తపింజరి పాము రెండు సార్లు కాటువేసింది. దీంతో ఆమెనునూజివీడు అమెరికన్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహానికి నూజివీడు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం.. ఒకరి అరెస్ట్

ముసునూరు, మార్చి 19: మండలంలోని చెక్కపల్లి గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై పి.వాసు తన సిబ్బందితో కలిసి చెక్కపల్లిలో అనధికార మద్యం విక్రయాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తాళం పెద ఆంజనేయులు అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.750లు విలువగల 5 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఆగిరిపల్లి, మార్చి 19: పెళ్లయిన ఆరు నెలలకే కట్నం వేధింపులు ప్రారంభం అయ్యాయని బాధితురాలు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆగిరిపల్లికి చెందిన అంజలికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన పత్తిపాటి మృదం అనే వ్యక్తితో ఆరునెలల క్రితం వివాహం కాగా అదనపు కట్నం కోసం అత్తింటివారు హింసిస్తున్నారని బాధితురాలు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తవేర్యా నాయక్ తెలిపారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన


ఆగిరిపల్లి, మార్చి 19: ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి ఆవరణలో ఆదివారం రాత్రి నిద్రిస్తుండగా కొడుకు వరసైన నల్లమోతు కిషోర్ అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తవేర్యా నాయక్ తెలిపారు.



లోపూడిలో తొలగించని వైసీపీ హోర్డింగ్



ముదినేపల్లిలో బడ్డీలపై ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న పోస్టర్లు తొలగింపు



రాచపట్నంలో జనసేన జెండాలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వదల బొమ్మాళీ!

- కోడ్ అమల్లోకి వచ్చినా దర్శనమిస్తున్న అధికార పార్టీ హోర్డింగ్‌లు
- పలుచోట్ల కొనసాగుతున్న తొలగింపులు

ముసునూరు, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ నేతల ఫొటోలు, ప్రభుత్వ పథకాల హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని వీటిపై ఎవరికీ మినహాయింపు లేదంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చినా కొందరు అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ముసునూరు మండలం మా నమ్మకం నువ్వే జగన్ హోర్డింగ్‌ను తొలగించ లేదు. కోడ్‌ను అమలు చేయాల్సిన మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడటం, గ్రామస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను తొలగించటంలో ఉత్సాహం చూపించిన అధికారులు అధికార పార్టీ హోర్డింగ్‌లను తొలగించటంలో చూపించటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

చాట్రాయి: ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో అధికారులు గ్రామాల్లో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, ప్రభుత్వ పథకాల హోర్డింగ్‌లు తొలగించారు. అయితే చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో శివపురం వెళ్ళే రహదారి వద్ద ఓ భవనంపై మా నమ్మకం నువ్వే జగన్ హోర్డింగ్ మాత్రం తొలగించలేదు. కోడ్ అమలు చేయవలసిన అధికారులకు ఈ హోర్డింగ్ కన్పించలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మంగళవారం నాడూ కొనసాగిన తొలగింపులు...

కైకలూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగిస్తూనే ఉన్నారు. నిబంధనలు అమల్లోకి వచ్చినా వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు గ్రామాల్లో ఉన్నాయి. గ్రామ సరిహద్దుల్లో స్వాగతం బోర్డులపైన అలానే ఉన్నాయి. దీంతో కైకలూరు తహసీల్దార్ ఎస్. పోతురాజు మంగళవారం మండలంలోని గోపవరం, రాచపట్నం గ్రామాల్లోని వైసీపీ ఫ్లెక్సీలను దగ్గరుండి తొలగించారు. పంచాయతీ అధికారులు వీటిని తొలగించవలసి ఉండగా వారు పట్టించుకోకపోవడంతో తహసీల్దారే నేరుగా తన సిబ్బందితో ఫ్లెక్సీలను తీయించారు. అలాగే ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు.

అధికార్ల పాట్లు..

ముదినేపల్లి, మార్చి 19: కోడ్ అమల్లో అధికారుల పాట్లు వర్ణనాతీతం. ఏ మాత్రం పొరపాట్లు జరగకుండా సంబంధిత శాఖ అధికారు లు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికా రులు ఆదేశిస్తుండటంతో మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు. రాజకీయ నాయ కుల విగ్రహాలకు ముసుగులు వేయటం, ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించేందుకు గడువు సోమవారం సాయంత్రంతో ముగిసినప్పటికీ గ్రామాల్లో ఇంకా ఏమైనా మిగిలాయేమోనని సిబ్బంది మంగళ వారం గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలో సుమారు 250 విగ్రహాలకు ముసుగులు వేసి వెయ్యి ఫ్లెక్సీలను తొలగించారు. తహసీల్దార్ లక్ష్మీ నరస కుమారి, ఎంపీడీవో గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచా యతీల కార్యదర్శులు, వీఆర్వోలు మండలంలో విస్తృతంగా గాలించి ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని పలు గృహాలు, వ్యాపార సంస్థల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించేందుకు రెండు రోజులుగా అవస్థలు పడ్డారు.



రమణక్కపేటలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి పార్థసారథి



తాడినాడలో కరపత్రాల పంపిణీ

మూడు సార్లు గెలిచినా అభివృద్ధి ఏది దొరా?

ముసునూరు, మార్చి 19: నూజివీడు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానని కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక దొర మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నేటికి నూజివీడు అభివృద్ధికి నోచుకోలేదని, రెండు రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి కూడా జరగని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని విమర్శించారు. రెండు సార్లు టీడీపీ అధిష్టానం ముద్దరబోయినకు నూజివీడు టికెట్ ఇచ్చిందని, ఆయన గెలవకపోడంతో తనకు చంద్రబాబు, లోకేష్ అవకాశం ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యతగా కృషిచేసి నూజివీడులో టీడీపీ జెండాను ఎగురవేయాలని పార్థసారథి కోరారు. సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారయణ, పార్టీ మండల అధ్యక్షులు దేవినేని బలరాం, గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, బర్మా శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మానురాజు సురేష్, తెలుగుయువత రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, టీడీపీ నాయకులు నూతక్కి వేణు గోపాలరావు, కొల్లి గంగారామ్, శ్రీకాంత్, జనసేన, బీజేపీ నాయకులు బర్మా ఫణిబాబు, అముదాల ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మురుగునీటి సమస్య పరిష్కరిస్తా..

నూజివీడు టౌన్: ట్రిపుల్ ఐటీ నుంచి వెలువడే మురుగునీటి సమస్యను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని నూజివీడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మున్సిపల్ పరిధిలో 'మన ఇంటికి మన సారథి' కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు, గొడుగువారి గూడెంలలో ఆయన పర్యటించారు. గత 15 ఏళ్లుగా ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్యతో బాధపడుతున్నామని ఎన్నికల సమయంలో సమస్య విని వెళుతు న్నారే తప్ప పరిష్కరించడం లేదని, మురుగునీటితో అంటువ్యాధులు ప్రబలుతు న్నాయని గొడుగువారిగూడెం వాసులు ఆయన దృష్టికి తీసుకువ చ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ తాత్కాలికంగా మురుగునీరు పారేలా చర్యలు తీసుకుం టామని, అధికారంలోకి రాగానే యుద్ధప్రాతిపదికన ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వీధి దీపాలు సైతం ఈ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, రహదారులు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తేగా అధికారంలోకి రాగానే పక్కా రహదారుల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ కొమ్మన విజయ, మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి, పాదం సత్యనారాయణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు పాదం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మాజీ ఫ్లోర్‌లీడర్ పసుపులేటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కలిదిండి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు సంబారి వెంకట రామరాజు అన్నారు. మంగళవారం తాడినాడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి మేనిఫెస్టోలో పొందుపర్చిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపునకు సహకరించాలన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెన్మెత్స రాము, బూత్ ఇన్‌చార్జ్ పి.రామకృష్ణంరాజు, నాయకులు చేబ్రోలు శ్రీనివాసరావు, రామరాజు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

బీసీల సంక్షేమమే కూటమి లక్ష్యం : కామినేని

కలిదిండి, మార్చి 19 : బీసీల సంక్షేమమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మట్టగుంటలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించిందన్నారు. అగ్నికుల క్షత్రియులు నివశించే పల్లిపాలెంను 'పల్లవపాలెం'గా మార్పు చేసి వారి గౌరవాన్ని పెంచుతున్నామన్నారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో తాగునీటి చెరువులు అడు గంటి మంచినీటి సమస్య తలెత్తినప్పటికీ తాగునీరు విడుదల చేయకపోవటం దారుణమన్నారు. సాగు, తాగునీరు అందించటంలో వైసీపీ ఘోరంగా విఫలమైందన్నారు. చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర లేక ఆక్వా రైతులు అల్లాడుతుంటే విద్యుత్ చార్జీలు పెంచి వారి నడ్డి విరిచిందన్నారు. లంక గ్రామాల్లో రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉన్నప్పటికీ మరమ్మతులు చేసిన దాఖలాలు లేవన్నారు. వైసీపీ అరాచక పాలన అంతం చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంధ్రాజు శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, నాయకులు భోగేశ్వరరావు, వీర బ్రహ్మం, తేరా రమేష్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కలిదిండిలో సాయుధ బలగాల కవాతు



కలిదిండి, మార్చి 19 : కోడ్ అమల్లోకి రావటంతో కలిదిండి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మంగళవారం కలిదిండిలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా కైకలూరు సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. పౌరుల ఓటు హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ ప్రియకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వడాలి టీడీపీకి కంచుకోట : దావు

ముదినేపల్లి రూరల్, మార్చి 19: మండలంలోని వడాలిలో సోమవారం వైసీపీలో చేరిన గ్రామస్థులు అదే పార్టీ మద్దతుదారులని కొత్తగా చేరిందేమీ లేదని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు దావు నాగరాజు తెలిపారు. ఇతర పార్టీకి చెందిన వారు చేరినట్లు వైసీపీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తెలుగుదేశానికి చెందిన సానుభూతిపరులు మద్దతుదారులు ఎవరూ పార్టీని వీడి వెళ్ళలేదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి వడాలి కంచుకోటని, గత ఎన్నికల్లో వైసీపీ గాలి రాష్ట్రవ్యాప్తంగా వీచినప్పటికి వడాలి గ్రామంలో మాత్రం టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిందని నాగరాజు గుర్తు చేశారు.

ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదు

ఆగిరిపల్లి, మార్చి 19: కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు గడువు ఏప్రిల్ 15 వరకు పొడిగించారని, ఆగిరిపల్లి తహసీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కలిదిండి, మార్చి 19 : కోడ్ అమల్లోకి రావటంతో మద్వానిగూడెం చెక్ పోస్టు వద్ద ఎస్ఎస్ టీం అధికారులు మంగళవారం వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో తరలించే ఆధారాలు లేని నగదు, వస్తు సామాగ్రి, దుస్తులను సీజ్ చేస్తామన్నారు. మైనింగ్ అనుమతులు లేకుండా ఇసుకను టిప్పర్లతో తరలిస్తే టిప్పర్లను స్వాధీనం చేసుకుంటామన్నారు. సోమవారం రాత్రి నుంచి చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఎస్ఎస్ టీం అధికారి గంగాధర్, తహసీల్దార్ దశిక వంశీ, వీఆర్వో ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లికుమార్తెగా జలదుర్గ అమ్మవారు



అమ్మవారికి నైవేద్యం తీసుకువెళుతున్న మహిళలు

కైకలూరు, మార్చి 19: కొల్లేటి కోట పెద్దింటమ్మ వారి జాతర మహోత్సవాల్లో మంగళ వారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మ వారిని దర్శించుకున్నారు. జలదుర్గ (పెద్దింటమ్మ) అమ్మవారికి విశేష అభిషేకాల అనంతరం పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఈ సందర్భంగా కలశపూజ, కుంకుమపూజలు, పంచ హారతులిచ్చారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ భుజబలపట్నానికి చెందిన ముదునూరి వెంకట శ్రీనివాసరాజు, నాగజ్యోతి, ఆకివీడుకు చెందిన పెన్మెత్స నాగ వెంకట పాండు రంగారావు, వెంకటలక్ష్మి దంపతులు చేశారు. ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ అధికారులు కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

22 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



కైకలూరు, మార్చి 19: వరహాపట్నంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి 122వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారి వీఎస్‌కె శేఖర్ తెలిపా రు. 22న కల్యాణం, 23న గరుడోత్సవం, కల్పవృక్ష సేవ, 24న చందనోత్సవం, నృసింహ యాగం, 25న శేషవాహనం, గజ వాహనంపై గ్రామోత్సవం, 26న అఖండ అన్నసమారాధన, స్వామివారి పవళింపుసేవ నిర్వహిస్తామని, ప్రతి రోజూ రాత్రి భక్తిరంజని, వినోద కార్యక్ర మాలుంటాయన్నారు. ఉత్సవాలను వంశపారంపర్య ధర్మకర్తలు డాక్టర్ కామి నేని పట్టాభిరామయ్య, డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

కైకలూరు, మార్చి 19: మండలంలోని గోనెపాడు శ్రీ గంగా పార్వతీ సమేత జలలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయంలో హోమాలు శయ్యాధివాసం, ధాన్యాధివాసం ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. బుధవారం ఉదయం 10.08 గంటలకు శ్రీమహాగణపతి, నవగ్రహ, నాగదేవత, అయ్యప్పస్వామి, గంగాపార్వతీ సమేత శ్రీజలలింగేశ్వర స్వామి వార్ల యంత్ర, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

వైభవంగా మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు



కలిదిండి, మార్చి 19 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసీరావు దంపతులు పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ తమ్మిసీడి నాగేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డా : ముద్దరబోయిన



చాట్రాయి, మార్చి 19: పదేళ్ళ పాటు నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి, చిత్తశుద్ధితో పనిచేశానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చీపురుగూడెం శివారు మంగపేటలో మంగళవారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనను గెలిపించాలని కోరారు.



ముదినేపల్లి హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

రెండో రోజు టెన్త్ పరీక్ష ప్రశాంతం

నూజివీడు టౌన్, మార్చి 19: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో రెండో రోజు మంగళవారం హిందీ పరీక్షకు మొత్తం 178 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నూజివీడు డివిజన్ పరిధిలో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 3,478 మంది విద్యార్థులకు గాను 3,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు డీవైఈవో సేవ్యా తెలిపారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 3,347 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 89 మంది గైర్హాజరు కాగా 131 మంది ప్రైవేట్ విద్యార్థులకు 89 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు వెల్లడించారు.

ముసునూరు: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలు 2వరోజు మంగళవారం ప్రశాంతంగా ముగిసాయి. హిందీ పరీక్షకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముసునూరు జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 207 మందికి గాను 200 మంది, గోపవరంలో 150 మందికి గాను 146 మంది హాజరయ్యారు. చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో 251 మందికి 234 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ జవహర్ బాజి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి తనిఖీలు చేశారు. ఎస్సై పి.వాసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

చాట్రాయి: చాట్రాయిలోని జడ్పీ హైస్కూల్, ఆర్సీఎం స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రాలలో మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. మొత్తం 373 మంది హాజరు కావల్సి ఉండగా 346 మంది హాజరైనట్లు ఎంఈవో వివరించారు.

ఆగిరిపల్లి: మండలం మంగళవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జడ్పీ హైస్కూల్‌లో 210 మంది విద్యార్థులకు 207 మంది హాజరయ్యారని, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 174 మందికి ఒకరు గైర్హాజరయ్యారని, ఎస్‌వీ పబ్లిక్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 210 మందికి ఇద్దరు గైర్హాజరైనట్టు ఎంఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

ముదినేపల్లి: పదవ తరగతి పరీక్షలు రెండో రోజు మంగళవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. నాలుగు పరీక్షా కేంద్రాల్లో హిందీ పరీక్షకు 643 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 41 మంది గైర్హాజరయ్యారు. పెదగొన్నూరు హైస్కూల్‌లో 16 మంది, ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో నలుగురు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడుగురు, సహాయ మాతా హైస్కూలు పరీక్షా కేంద్రంలో 14 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ముదినేపల్లి, పెదగొన్నూరు, అల్లూరు, గురజ హైస్కూళ్ల హెచ్ఎంలు విజయ కుమార్, ఉదయ భాస్కర్, రామోజీ, జి. కృష్ణమోహన్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

నేటి నుంచి ముమ్మర తనిఖీలు

పదవ తరగతి పరీక్షల నిర్వహణపై బుధవారం నుంచి ప్రత్యేక బృందాల తనిఖీలు పెరగనున్నాయి. పరీక్షా కేంద్రాల తనిఖీలను ముమ్మరం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో ముదినేపల్లి మండలంలోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు అప్రమత్తమవుతున్నారు.

కలిదిండి: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం హిందీ పరీక్షకు 921 మంది విద్యార్థులకు గానూ 859 మంది హాజరై రు కాగా, 62 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. ఎస్ఐ ప్రియకుమార్ పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.